ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

కర్ణాటక వార్తలు

బుధవారం 10 జనవరి 2024



14న నగరంలో ఆనంద్ మహోత్సవ్

బెంగళూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): బెంగళూరు ప్యాలెస్ మైదానంలో ఈ నెల 14న ఆనంద్ మహోత్సవ్ ఏర్పాటవుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతికి చెందిన సద్గురు సిద్దేశ్వర్ బ్రహ్మర్షి గురుదేవ్ సాన్నిధ్యంలో ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి మహోత్సవాలు ఉంటాయని విశ్వధర్మ చేతన మంచ్ బెంగళూరు కేంద్రం నగరంలో మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించింది. మెజ్రిసర్కిల్ సమీపంలోని రాయల్ సెనేట్ ప్రాంగణంలో ఈ ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనవచ్చునని అంచనా వేస్తూ ఆమేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సంస్థ తెలిపింది.

అక్రమార్కులపై లోకాయుక్త పంజా

- రాష్ట్ర వ్యాప్తంగా ఏకకాలంలో 30 చోట్ల దాడులు
- ఆరుగురు అధికారుల నివాసాలు, కార్యాలయాల్లో సోదాలు
- భారీగా నగదు, డాక్యుమెంట్లు స్వాధీనం



ఏజీఓ సురేశ్ ఇంట్లో స్వాధీనం చేసుకున్న మద్యం, నగదు



చెన్నేనహళ్లి పంచాయతీ సభ్యుడు సురేశ్

బెంగళూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అవినీతి అధికారులపై లోకాయుక్త పోలీసులు పంజా విసిరారు. మంగళవారం ఉదయం నుంచే ఆరుగురు ఉన్నతాధికారుల నివాసాలు, ఇతర ప్రాంతాలపై 30చోట్ల ఏకకాలంలో దాడులు నిర్వహించి కోట్లాది రూపాయల విలువైన అక్రమ ఆస్తులను గుర్తించారు. బెస్కాం చీఫ్ జనరల్ మేనేజర్ ఎంఎల్ నాగరాజ్, ప్రజా పనులశాఖ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ సతీశ్‌బాబు, కుందాణ గ్రామ పంచాయతీ అభివృద్ధి కార్యదర్శి డీఎన్ పద్మనాభ, కర్ణాటక గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సయ్యద్ మునీర్, బీబీఎంపీ నగర ప్రణాళికా విభాగం జాయింట్ డైరెక్టర్ బి. మంజేశ్, చెన్నేనహళ్లి గ్రామపంచాయతీ సభ్యుడు హెచ్‌ఎస్ సురేశ్ నివాసాలపై ఏకకాలంలో లోకాయుక్త దాడులు సాగాయి. ఆదాయానికి మించి భారీగా ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణల నేపథ్యంలో పెద్దసంఖ్యలో పోలీసు సిబ్బంది సహకారంతో లోకాయుక్త అధికారులు మెరుపుదాడులు నిర్వహించారు. ఆరుగురిపై అవినీతి నిరోధకచట్టం కింద ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. వీరిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వానికి సిఫారసు చేశారు. బెంగళూరుతో పాటు రామనగర, బళ్లారి, చిత్రదుర్గ, మండ్య, విజయనగర తదితర 30 ప్రాంతాల్లో ఈ అధికారుల నివాసాలు, కార్యాలయాలు, బినామీ ఆస్తులపై దాడులు నిర్వహించారు. వీరిలో నాగరాజ్ కొన్నిరోజుల క్రితం రూ.7.50 లక్షల లంచం తీసుకుంటూ దొరికిపోయాడు. విజయనగర్‌లో బెస్కాం జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న నాగరాజ్‌కు బెంగళూరులో పలుచోట్ల విలాసవంతమైన భవనాలు ఉన్నట్టు గుర్తించారు. నాగరాజ్ నిర్వహిస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థల్లోనూ సోదాలు జరిగాయి. విజయనగర జిల్లా కూడ్లిగిలో వీరి కుటుంబ సభ్యుల పేరిట రెండు పెట్రోల్ బంకులు ఉన్నట్టు గుర్తించారు. కాగా బీబీఎంపీ అధికారి మంజేశ్ నివాసాలపై బెంగళూరుతోపాటు మండ్యలోని మళవళ్లి తాలూకా హలగూరు, గుండాపుర గ్రామాల్లో దాడులు జరిగాయి. మద్దూరులోని వీరి నివాసాలపై దాడులు చేశారు. నియమాలను ఉల్లంఘించి భవనాల నిర్మాణానికి ప్లాన్‌లను ఎన్‌ఓసీ మంజూరు చేసేందుకు ఇతను భారీగా ముడుపులు తీసుకుంటున్నట్టు లోకాయుక్త అధికారుల పరిశీలనలో తేలింది. ఆరుగురు అధికారుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, బంగారు ఆభరణాలు, అక్రమ ఆస్తుల విలువ ఎంత అనేది లోకాయుక్త అధికారులు వెల్లడించలేదు. అయితే ఇది రూ.వందకోట్లకు పైగానే ఉంటుందని భావిస్తున్నారు. లోకాయుక్త దాడులు జరిపిన ఆరుగురు అధికారులపై చర్యలు తీసుకుంటున్నామని హోంశాఖ మంత్రి డాక్టర్ జి. పరమేశ్వర్ బెంగళూరులో మీడియాకు తెలిపారు.



సతీశ్‌బాబు ఇంట్లో స్వాధీనం చేసుకున్న నగదు, నగలు



పీడీఓ పద్మనాభ



మృదంగం వాయిస్తున్న సీఎం సిద్దరామయ్య

తుదిశ్వాస వరకు

సామాజిక న్యాయం కోసం కృషి

- కల్యాణ కర్ణాటక సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక యాక్షన్‌ప్లాన్ : సీఎం

బెంగళూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తుదిశ్వాస వరకు సామాజిక న్యాయం కోసం కృషి చేస్తానని, కన్నడిగుల ఆత్మాభిమానాన్ని పెంపొందించే రాజకీయాలు చేస్తానని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రకటించారు. గాంధీభవన్‌లో సవితా సమాజ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ ఎంఎస్ ముత్తురాజ్ రచించిన 'మంగళవాద్య' గ్రంథాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగిస్తూ మనం చేసే ఏ పని కూడా గొప్పది, చిన్నది అనే తేడా ఉండదన్నారు. అన్ని పనులు భగవంతుడి దృష్టిలో సమానమే అన్నారు. బసవణ్ణ తన వచనాలతో దీన్నే చాటి చెప్పారని గుర్తు చేశారు. నేడు ముస్లింలు, దళితుల పట్ల వివక్షత చూపించడం దారుణమని పేర్కొన్నారు. ఇది మానవతా విలువలకు జరిగే ఘోరమైన అన్యాయమని తెలిపారు. నేటికీ దళితులను దేవస్థానాల్లోకి రానివ్వడం లేదని, అంటరానితనం ఇంకా కనిపిస్తోందని ఆవేదన చెందారు. అనంతరం ఆయన తన అధికార నివాసం కృష్ణలో జరిగిన కల్యాణ కర్ణాటక ప్రాంతీయ అభివృద్ధి మండలి కీలక సమావేశానికి హాజరయ్యారు. అధ్యక్షుడు అజయ్‌సింగ్‌తోపాటు పలువురు మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగిస్తూ కల్యాణ కర్ణాటక అభివృద్ధి కోసం తక్షణం యాక్షన్‌ప్లాన్‌ను సిద్ధం చేయాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తూనే కల్యాణ కర్ణాటక సంక్షేమానికి రూ.757.66 కోట్లను ఖర్చు చేసిందన్నారు. ఇప్పటికీ బోర్డు వద్ద రూ.2,106 కోట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఏడాది చివరకు వెయ్యి కోట్లతో పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలని, ఇందుకు యాక్షన్‌ప్లాన్‌ను సిద్ధం చేయాలని అధ్యక్షుడు అజయ్‌సింగ్‌కు సూచించారు.

అధిష్టానం ఆదేశిస్తే మళ్లీ బరిలోకి

- ఉత్తర కన్నడ బీజేపీ ఎంపీ అనంతకుమార్ హెగ్డే వెల్లడి



బెంగళూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీజేపీ ఫైర్ బ్రాండ్‌గా ఖ్యాతి పొందిన ఉత్తర కన్నడ ఎంపీ అనంతకుమార్ హెగ్డే మళ్లీ క్రియాశీలక రాజకీయాల్లోకి వచ్చారు. అనారోగ్యం ఇతరత్రా సమస్యలతో ఆయన చాలా కాలంగా ప్రజాక్షేత్రంలో పెద్దగా కనిపించలేదు. ఇటీవల పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బీవై విజయేంద్ర ఉత్తర కన్నడ సిట్టింగ్ ఎంపీ అనంతకుమార్ హెగ్డే నివాసానికి వెళ్లి క్రియాశీలక రాజకీయాల్లోకి రావాలని ఆహ్వానించారు. మరోసారి పోటీచేసేందుకు గతంలో విముఖత చూపిన ఆయన తాజాగా ఒక వేళ అధిష్ఠానం ఆదేశిస్తే బరిలోకి దిగాలని భావిస్తున్నట్లు తెలిసింది. ఉత్తర కన్నడ నియోజకవర్గం టికెట్ తిరిగి అనంతకుమార్ హెగ్డేకే లభిస్తుందన్న ప్రచారం కూడా బీజేపీ శ్రేణుల్లో జరుగుతోంది. పార్టీ కోరితే తాను కూడా ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొంటానని, దక్షిణాదిన బీజేపీకి ఈసారి అత్యధిక స్థానాలు దక్కాల్సిన అవసరం ఉందని అనంతకుమార్ హెగ్డే మంగళవారం తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ అన్నారు. కర్ణాటకలో 2019లో గెలిచిన స్థానాలను నిలుపుకోవడంతో పాటు అదనంగా మరో స్థానాన్ని కూడా బీజేపీ కైవసం చేసుకోవడం ఖాయమని జోస్యం చెప్పారు. ఈసారి రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ఒక్క స్థానం కూడా దక్కదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ బుజ్జగింపు రాజకీయాలు రోత పుట్టిస్తున్నాయని ఇందుకు ఆ పార్టీ వచ్చే ఎన్నికల్లో భారీగా మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

రాష్ట్రంలో తీవ్ర కరువు

- రైతులను ఆదుకునేలా సర్కార్‌కు దిశానిర్దేశం చేయండి
- గవర్నర్‌కు బీజేపీ నేతల వినతి

బెంగళూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తీవ్ర కరువు కాటకాలు నెలకొని ఉన్న నేపథ్యంలో రైతాంగానికి తగిన పరిహారం లభించేలా చొరవ తీసుకోవాలని, ఈ మేరకు ప్రభుత్వానికి తగిన రీతిలో దిశానిర్దేశం చేయాలని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌కు బీజేపీ నేతల బృందం విజ్ఞప్తి చేసింది. శాసనసభలో ప్రతిపక్ష నేత ఆర్. అశోక్ సారథ్యంలో నేతల బృందం మంగళవారం రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌కు వినతి పత్రం అందజేసింది. గతంలో కనీవినీ ఎరుగని రీతిలో రాష్ట్రంలో కరువు పరిస్థితి నెలకొని ఉందని, అన్నదాత సంక్షోభం ఉబిలో కొట్టుమిట్టాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఈ బృందం గవర్నర్‌కు ఫిర్యాదు చేసింది. మొద్దునిద్రలో ఉన్న ప్రభుత్వానికి ఈ విషయంలో తగిన సూచనలు చేయాలని కోరింది. గవర్నర్‌ను కలిసిన బృందంలో మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై, మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ సీ ఎన్ అశ్వత్థనారాయణ, మాజీ మంత్రి కె. గోపాలయ్య, ఎమ్మెల్యేలు ఎస్. రఘు, రవి సుబ్రహ్మణ్య, కె. రామమూర్తి తదితరులు ఉన్నారు. తమ వినతిపై గవర్నర్ సానుకూలంగా స్పందించారని అనంతరం ప్రతిపక్ష నేత అశోక్ మీడియాకు చెప్పారు. మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై మీడియాతో మాట్లాడుతూ రైతులకు అన్యాయం చేస్తే ప్రభుత్వానికి మనుగడ ఉండదని హెచ్చరించారు. ప్రకృతి వైపరీత్యాల సహాయ నిధి కోటాలో వివిధ జిల్లా అధికారుల ఖాతాల్లో ఎంత మొత్తం ఉందో తక్షణం ప్రకటించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రాన్ని తక్షణ సాయంగా రూ.18వేల కోట్లు కోరిన రాష్ట్ర ప్రభుత్వం తాను మాత్రం కేవలం రూ.105 కోట్లు మాత్రమే విడుదల చేయడం విడ్డూరంగా ఉందని, పైగా బెళగావి శాసనసభ సమావేశాల సమయంలో అన్నదాత ఖాతాలోకి రూ.2వేలు వేస్తామని ప్రకటించినా ఇంతవరకు ఒక్కపైసా విడుదల చేయలేదని బొమ్మై ఆరోపించారు.



గవర్నర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

ఇది కన్నడిగులకు అవమానం

- రిపబ్లిక్ డే వేడుకల్లో రాష్ట్ర శకటానికి నిరాకరణపై సీఎం ఆగ్రహం

బెంగళూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఈనెల 26న జరిగే రిపబ్లిక్ డే వేడుకల్లో కర్ణాటక శకటానికి అనుమతి నిరాకరిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయంపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఏడుకోట్లమంది కన్నడిగులకు జరిగిన అవమానమని పేర్కొన్నారు. నగరంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ఏడాది కూడా ఇలాగే రాష్ట్ర శకటాన్ని నిరాకరించారని, ఆపై ప్రజల్లో ఆగ్రహం వెల్లువెత్తడంతో అనుమతించారని గుర్తు చేశారు. ఈసారి నాల్వడి కృష్ణరాజ ఒడయార్ శకటంతోపాటు మొత్తం నాలుగు నమూనాలను కేంద్ర ఎంపిక కమిటీకి పంపించామని తెలిపారు. ఇందులో బ్రాండ్ బెంగళూరు, కిత్తూరు చెన్నమ్మ, కర్ణాటక ప్రకృతి రమణీయత శకటాలు ఉన్నాయన్నారు. ఎంపిక కమిటీ ఏకపక్షంగా కర్ణాటక శకటానికి అనుమతి నిరాకరించడం విచారకరమన్నారు. అభివృద్ధి విషయంలో ఇలాంటి దిగజారుడు రాజకీయాలు సరికావన్నారు. ప్రతీ సారి రాష్ట్రానికి అన్యాయం చేయడం తగదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టడాన్ని తట్టుకోలేకపోతున్న కేంద్రం పలు రకాలుగా వేధిస్తోందని, ప్రతి విషయంలోనూ అన్యాయం చేస్తోందని, తగిన సమయంలో వీటిపై ప్రజల్లోకి వెళ్తామని సిద్దరామయ్య తెలిపారు.

ఇండియా కూటమి మాకు పోటీయే కాదు

- కన్వీనర్‌నే ఎంపిక చేసుకోలేకపోయారు
- ప్రధానిని ఎలా ఎంపిక చేస్తారో...?
- కేంద్రమంత్రి హర్‌దీప్‌సింగ్‌పురి ఎద్దేవా

బెంగళూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): 'ఇండియా' కూటమి కన్వీనర్‌ను ఎంపిక చేసుకోలేక మల్లగుల్లాలు పడుతున్న ప్రతిపక్షాలు ఒకవేళ అధికారమే దక్కితే ప్రధానిని ఎలా ఎన్నుకుంటారో అంటూ కేంద్రమంత్రి హర్‌దీప్‌సింగ్‌పురి ఎద్దేవా చేశారు. బెంగళూరు మల్లేశ్వరంలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇండియా కూటమిని చూసి తాము ఏమాత్రం భయపడడం లేదని, అసలు ఈ కూటమి తమకు పోటీయే కాదన్నారు. ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లోనే ఇండియా కూటమి సత్తా తేలిపోయిందన్నారు. ఆ కూటమిలో ప్రధాని పదవికి అరడజనుమంది పోటీ పడుతున్నారని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్రం 7.6 శాతం ఆర్థిక ప్రగతి సాధించిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెరుగుతున్నా ప్రధాని మోదీ రెండుసార్లు మనదేశంలో ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించారన్నారు. వికసిత భారత సంకల్పయాత్రకు దేశవ్యాప్తంగా విశేష ఆదరణ లభిస్తోందని తెలిపారు. కేంద్రప్రభుత్వ విజయాల ఆధారంగానే లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగుతామన్నారు. మీడియా సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, లోక్‌సభ సభ్యుడు పీసీ మోహన్ పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో కేంద్రమంత్రి హర్‌దీప్‌సింగ్‌పురి తదితరులు


విదేశీయులతో వ్యభిచారం

- ముఠా గుట్టు రట్టు చేసిన పోలీసులు

బెంగళూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): టెలిగ్రామ్, వాట్సప్ ద్వారా వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్న ముఠా గుట్టును నగర పోలీసులు రట్టు చేశారు. వీటి వివరాలను నగర పోలీసు కమిషనర్ బి. దయానంద్ మంగళవారం మీడియాకు తెలిపారు. ఈ ముఠాకు విదేశీయురాలు సారథ్యం వహిస్తున్నట్టు తెలుసుకుని షాక్‌కు గురయ్యామన్నారు. టర్కీకి చెందిన డియోనాజ్ రోహిత్‌స్వామిగౌడ (40)ను బయ్యప్పనహళ్లి పోలీసులు అరెస్టు చేశారని తెలిపారు. ఎనిమిది సంవత్సరాలుగా విదేశాలకు చెందిన యువతులను ఆకర్షించే వారితో ఈ ముఠా వ్యభిచారం చేయిస్తోందన్నారు. దాడి సమయంలో టర్కీకి చెందిన ముగ్గురు, ఉజ్బెకిస్తాన్, కజకిస్తాన్‌కు చెందిన తలా ఇద్దరు యువతులతో కలసి మొత్తం 9 మందిని ముఠా బారి నుంచి కాపాడామన్నారు. టర్కీకి చెందిన డియోనాజ్ అనే మహిళ కర్ణాటకకు చెందిన స్వామిగౌడను 15 సంవత్సరాల క్రితం పెళ్లి చేసుకుందని తెలిపారు. అనంతరం మాస్టర్ మైండ్ ప్రయోగించి సోషల్ మీడియాను వేదికగా మార్చుకుని వ్యభిచారం నిర్వహిస్తున్నట్టు గుర్తించామన్నారు. నగరంలోని హలసూరు లీలాపార్క్ హోటల్‌లో అక్రమంగా యువతులను ఉంచి పిలిచినప్పుడల్లా వచ్చేలా ఏర్పాట్లు చేసుకున్నట్టు తమ పరిశీలనలో బయటపడిందన్నారు. బెంగళూరు డేటింగ్‌క్లబ్ అనే టెలిగ్రామ్ ద్వారా వీరు విటులను ఆకర్షిస్తున్నట్టు గుర్తించామని తెలిపారు. విద్య, ఉపాధి నిమిత్తం నగరానికి వచ్చే విదేశీ యువతులను వలలో వేసుకుని బలవంతంగా వారిని వ్యభిచారం కూపంలోకి దించుతున్నారని వివరించారు. పరారీలో ఉన్న రోహిత్‌స్వామిగౌడ కోసం గాలిస్తున్నామని, ఈ ముఠా బెంగళూరులోనే కాకుండా జైపూర్, చెన్నై, మైసూరు, ఢిల్లీ, ఉదయ్‌పూర్, ముంబై వంటి నగరాల్లో కూడా ఏజెంట్లతో సంబంధాలు కలిగి ఉందని నగర పోలీస్ కమిషనర్ వివరించారు. మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామని, ముఠాలోని ఇతర సభ్యుల కోసం గాలిస్తున్నామన్నారు. వీరికి సహకరిస్తున్నవారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. బయ్యప్పనహళ్లి, హలసూరు పోలీసులు సంయుక్తంగా కార్యాచరణ చేపట్టి విదేశీ యువతులతో వ్యభిచార గుట్టును విజయవంతంగా ఛేదించగలిగామన్నారు. మీడియా సమావేశంలో డీసీపీ డి. దేవరాజ్ పాల్గొన్నారు.



మీడియాతో నగర పోలీస్ కమిషనర్ దయానంద్



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1589.00	1,622.70
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	635
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1709	8,187
సామర్థ్యం (టీఎంసీలు)	10.21	69.23

అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించిన
దుండగుల అరెస్టుకు డిమాండ్



వినతి పత్రం సమర్పిస్తున్న దళిత రక్షణా వేదిక

బళ్లారి సిటీ, జనవరి 09: గంగావతి పట్టణంలో కోర్టు ఎదురుగా ఉన్న భారతరత్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ ప్రతిమకు అవమానం చేసిన దుండగులను తక్షణం అరెస్టు చేయాలని కర్ణాటక దళిత రక్షణా వేదిక జిల్లా సమితి డిమాండ్ చేసింది. దీని విషయమై అదనపు జిల్లాకలెక్టర్ మహ్మద్ జుబేరకు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా కర్ణాటక దళిత రక్షణా వేదిక జిల్లా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మణ్ణ మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని అవమానపరిచినవారిని అరెస్టుచేసి శిక్షించాలన్నారు. ఆయనవెంట జిల్లా అధ్యక్షులు శంకర్ నందిహాళ, జిల్లాకార్యాధ్యక్షులు బసవ, చంద్రశేఖర్ ఉన్నారు.

ఆటో బోల్తా .. 12మందికి గాయాలు



క్షతగాత్రులకు చికిత్స చేస్తున్న వైద్యాధికారులు

సిరుగుప్ప, జనవరి 9 : బొలెరో వాహనం బోల్తాపడటంతో 12 మందికి గాయాలయిన సంఘటన సిరుగుప్ప తాలుకా పరిధిలోని అచ్చొళ్లి గ్రామ సమీపంలో మంగళవారం జరిగింది. బొలెరో ఆటోలో కూలీలు సిరుగుప్ప తాలుకా మంత్రాలయం నియోజకవర్గం సరిహద్దు ప్రాంతాలలో మిరప కాయల కోతకు బయలుదేరారు. మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో అచ్చొళ్లి దాటిన అనంతరం రోడ్డు పనులు జరుగుతున్న చోట ఎదురుగా వస్తున్న గడ్డి ట్రాక్టర్‌కు దోవ ఇవ్వడానికి డ్రైవర్ ఆటోను రోడ్డు నుంచి కిందకు దింపాడు. దీంతో ఓవర్ లోడుతో వున్న బొలెరో ఆటో బోల్తాపడింది. గాయపడిన కూలీ కార్మికులను అంబులెన్స్ ద్వారా పట్టణ ప్రభుత్వాస్పత్రికి తీసుకువచ్చి చికిత్స చేశారు. సంఘటనా స్థలానికి తాలుకా ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి ఈరణ్ణ, నగర వైద్యాధికారి డాక్టర్ గురునాథ్, ప్రశాంత్ కుమార్‌లు వచ్చి గాయాల బారినపడిన వారికి చికిత్సలు అందించారు. అందులో శశికళ (14), వాణిశ్రీ (15) ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు వైద్యాధికారి తెలిపారు. వీరు ఇరువురిని బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు సిరుగుప్ప పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ తిమ్మప్ప నాయక్ కేసు నమోదు చేశారు.

రికార్డులను తనిఖీ చేసిన కలెక్టర్



కరూరు ఉప తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీచేస్తున్న కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

సిరుగుప్ప, జనవరి 9: సిరుగుప్ప తాలుకాలోని కరూరు ఉప తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ఆకస్మికంగా సందర్శించారు. అధికారుల పనితీరును పరిశీలించారు. భూములకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో వుండాలని సూచించారు. పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించుకోవాలన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విశ్వనాథ్, రెవెన్యూ అధికారులు, గ్రామసభ్యులు పాల్గొన్నారు.

పేదల కోసం పుట్టినపార్టీ తెలుగు దేశం

- కమ్మ సంఘం జిల్లా కార్యదర్శి దామోదర్ చౌదరి
- బళ్లారిలో ఘనంగా పార్టీ 40 ఏళ్ల సంబరాలు



బళ్లారి కమ్మ భవనం వద్ద వేడుకలు జరుపుకుంటున్న టీడీపీనాయకులు

బళ్లారి జనవరి 9:(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో దివంగత నేత నందమూరి తారకరామరావు తెలుగు దేశం పార్టీని పేదల అభ్యున్నత కోసమే స్థాపించారని, అప్పటికి ఇప్పటికి పార్టీ పేదలకు గొడుగులా నీడనిస్తోందని కమ్మసంఘం జిల్లా కార్యదర్శి దామోదర్ చౌదరి, కమ్మనాయకుడు ఎస్.వెంకటనాయుడు అన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించి 40 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా బళ్లారి కమ్మ భవన్ వద్ద ఏర్పాటు చేసిన ఎన్.టీ.ఆర్ విగ్రహానికి పూలమాలవేసి అనంతరం కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా వెంకటనాయుడు మాట్లాడుతూ దివంగత నేత నందమూరి తారాక రామరావు యుగపురుషుడని, ప్రజల కోసం పార్టీని స్థాపించి ప్రజలకు అండగా నిలిచారన్నారు. తెలుగు దేశం పార్టీ నాటి నుంచి నేటి వరకు పేద ప్రజల కోసమే పనిచేస్తోందన్నారు. కర్ణాటక ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లోనూ తెలుగు దేశం పార్టీ అభిమానులు ఉన్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు దేశం గెలవడానికి ప్రవాసాంధ్రులంతా తమ వంతు కృషి చేస్తారన్నారు. ఈకార్యక్రమంలో వీరితో పాటు అభిలాష్, శ్రీన, జి.రమేశ్, రవి, నాగభూషణ, జయప్రకాశ్, వై.ఎర్రిస్వామి, వై. శీనా, నీలం ప్రసాద్‌చౌదరి, శేషగిరిరావు, రఘు, పైయ్యావుల శీనప్ప,రాము, రవికుమార్, జే.ఆంజనేయులు, ఎం.గోపాల్, శాంబశివరావు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మేయర్ పీఠం ఎవరికి దక్కేనో?

- నేడు మేయర్ ఎన్నిక
- రంగంలోకి కాంగ్రెస్ అధిష్టానం
- అందరి దృష్టి సీల్డ్ కవర్‌పైనే



సమావేశంలో చర్చించుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

బళ్లారి,జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బళ్లారి మేయర్ ఎన్నికపై సర్వత్రా ఉత్కంఠ ఏర్పడింది. ఇప్పటికే రెండు దఫాలు మేయర్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ అయినా అది వాయిదా పడుతూ వచ్చింది. ముచ్చటగా మూడో సారి మేయర్ ఎన్నికకు జనవరి 10 న ముహూర్తం కుదిరింది. ఇంతక ముందు మేయర్ గా ఉన్న త్రివేణి 2023 నవంబరు 4న రాజీనామా చేశారు. కొత్త మేయర్ అభ్యర్థిని ఎంపిక విషయంలో కాంగ్రెస్‌లో తీవ్ర పోటీ నెలకొంది. కాంగ్రెస్ పార్టీలో మేయర్ పదవికి మించు శ్రీనివాసులు, శ్వేత సోమశేఖర్, కుబేరా పోటీలో ఉన్నారు. చివరకు ఏకంగా కాంగ్రెస్ పార్టీ తరఫున ఉపముఖ్యమంత్రి డికే శివకుమార్ రంగంలోకి దిగారు. మేయర్ అభ్యర్థి విషయంపై కార్పొరేటర్లతో విడివిడిగా సమావేశం చేసి అభిప్రాయం తెలుసుకున్నారు. బుధవారం జరుగనున్న మేయర్ ఎన్నికపై మంగళవారం మంత్రి బి.నాగేంద్ర, ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, ఎంపీ నాసీర్ హుసేన్ కూడా కార్పొరేటర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఎట్టకేలకు బుధవారం బెంగళూరు నుండి కాంగ్రెస్ అధిష్టాన వర్గం మేయర్ అభ్యర్థి పేరు సీల్డు కవర్‌లో పంపాలని నిర్ణయించింది. ఈసీల్డ్ కవర్‌లో ఎవరిపేరు ఉంటుందోనన్న ఉత్కంఠ ఏర్పడింది. ఇదిఇలా ఉంటే బీజేపీ కూడా మంగళవారం ఒక హోటల్‌లో సమావేశం నిర్వహించింది. వారి వ్యూహం ఏమిటో వెల్లడి కాలేదు.

ఫ్లెక్సీల అనుమతికి జనార్దన్ రెడ్డి అనుచరుల ఆందోళన

బళ్లారి గాంధీనగర్, జనవరి 9: ఈ నెల 11న జరగనున్న మాజీ మంత్రి, కళ్యాణ రాష్ట్ర ప్రగతి పార్టీ(కెఆర్‌పిపి) అధినేత గాలి జనార్దన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు నగరంలో రాజకీయ రంగు పులుముకుంటున్నాయి. పుట్టిన వేడుకల్లో భాగంగా బళ్ళారి నగరంలో ఫ్లెక్సీల అనుమతి కోసం జనార్దన్ రెడ్డి అనుచరులు, కార్యకర్తలు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ నెల 11వ తేదీన జనార్దన్ రెడ్డి 57వ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా జరుపుకోవాలని ఆయన అభిమానులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో నగరంలో ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలంటూ మూడు రోజుల క్రితం సిటీ కార్పొరేషన్ కమీషనర్‌కు అర్జీ సమర్పించారు. అయితే మంగళవారం మధ్యాహ్నం గడిచినా కార్పొరేషన్ కమీషనర్ నుండి అనమతి రాకపోవడంతో కెఆర్‌పిపికి చెందిన మాజీ బుడా అధ్యక్షులు, దమ్మూరు శేఖర్, మాజీ సిటీ కార్పొరేషన్ మేయర్ గుర్రం రమణ, పెద్ద ఎత్తున కార్పొరేషన్ కమీషనర్ చాంబర్ వద్దకు చేరుకుని నినాదాలు చేశారు. అనంతరం కార్యాలయంలోకి వెళ్లి కమీషనర్ ఖలీల్ సాబ్‌తో వాగ్వాదానికి దిగారు.

తమ పార్టీ అధినేత గాలి జనార్దన్ రెడ్డి నగరాభివృద్ధికి ఎంతో కృషి చేశారని, ఆయన పుట్టిన రోజు వేడుకలు జరుపుకునే నేపథ్యంలో ఫ్లెక్సీల ఏర్పాటుకు ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని ప్రశ్నించారు. నిన్న మొన్నటి వరకు అనుమతి ఇస్తామని చెప్పి ఇప్పుడు కుదరదని చెప్పడం వెనుక మర్మమేమిటని నిలదీశారు. అనుమతి ఇవ్వడానికి సాధ్యం కాదని పేర్కొంటూ ఫైల్‌పై ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కమీషనర్ కార్యాలయంలోనే బైఠాయించారు. అప్పటికే అక్కడికి చేరుకున్న గాంధీనగర్ పోలీసు అధికారులకు, కెఆర్‌పిపి కార్యకర్తల మధ్య వా గ్వాదం జరిగింది. కమీషనర్ కార్యాలయంలో ఆందోళన చేయరాదని పోలీసు అధికారి చెప్పడంతో కెఆర్‌పిపి కార్యకర్తలు కార్పొరేషన్ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బయటకు వచ్చారు. కాంగ్రెస్ పార్టీకి నాయకులు తొత్తులుగా వ్యవహరించడం సరికాదని, అందరికి సమాన న్యాయం ఉండాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఏడాది డిసెంబరు నెలలో బెళగావిలో జరిగిన శీతాకాలపు సమావేశాల్లో బళ్ళారి సిటీ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డికి, మాజీ మంత్రి, ప్రస్తుత గంగావతి ఎమ్మెల్యేగా ఉన్న గాలి జనార్ధన్‌రెడ్డిల మధ్య నెలకొన్న మాటల యుద్ధం జరిగిన విషయం పాఠకులకు విదితమే.



కమిషనర్ ఖలీల్‌ను సాబ్‌ను వివరణ కోరుతున్న కేఆర్‌పీపీ ప్రముఖులు

ధ్వంసమవుతున్న రోడ్లు.. పట్టించుకోని అధికారులు

కంప్లి, జనవరి 9 : గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు వేసిన నెల రోజులు కాకముందే ధ్వంసమవుతున్నాయి. ఇలా జరుగుతున్నా గ్రామాల్లోని పీడీవో అధికారులు, ప్రజాప్రతినిధులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. సండూరు తాలుకా దరోజీ గ్రామం వద్ద డీఎంఎఫ్ నిధులతో తోరణగల్లు వైపు వెళ్లే రోడ్డును రూ. 4 కోట్లతో నిర్మించారు. కానీ రోడ్డు పూర్తయి కొద్ది నెలలు కాకముందే రోడ్డు పూర్తిగా ధ్వంసమయింది. స్థానిక గ్రామ ప్రజలు, జేఎస్‌డబ్ల్యూ గ్రామాల నుంచి జేఎస్‌డబ్ల్యూ కర్మాగారానికి వెళ్లే రోడ్డును వేరేగా ఏర్పాటు చేశారు. రైతులు ఆ రోడ్లను వినియోగించుకోకుండా తమ ఇళ్ల నుంచి ట్రాక్టర్లకు ఇనుప చక్రాలను బిగించుకుని పొలాలకు సేద్యం కోసం వెళుతున్నారు. ఇనుప చక్రాలతో వెళ్లడంవలన రోడ్డుపై నొక్కులు ఏర్పడి రోడ్లు పూర్తిగా ధ్వంసమై శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఇప్పటికైనా ఇలా జరుగకుండా జిల్లా అధికారులు గానీ, స్థానిక ప్రజాప్రతినిధులు గానీ ఆయా గ్రామాలలో నూతనంగా ఏర్పడిన రోడ్లపై ఇలా ఇనుప చక్రాలతో వెళుతున్న రైతులపై చర్యలు తీసుకున్నట్లయితే కొద్ది వరకు రోడ్లు ప్రయాణికులకు అనుకూలంగా వుంటాయి. లేకపోతే రోడ్లు నిర్మించిన నెలరోజుల్లో పూర్తిగా ధ్వంసమై ప్రజలు ఇబ్బందులు పడాల్సి ఉంటుంది.



దరోజీ నుంచి తోరణగల్లు నూతన రోడ్డుపై ఇనుప చక్రాలతో వెళుతున్న ట్రాక్టర్

మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

తోరణగల్లు, జనవరి 9 : సండూరు తాలుకా తోరణగల్లు గ్రామ పరిధిలోని మొరార్జీ దేశాయ్ అల్ప సంఖ్యాక వసతి పాఠశాలలో మంగళవారం అంతర్రాష్ట్రీయ మాదకద్రవ్య వ్యతిరేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, యువతీయువకులకు మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసు తనిఖీ విభాగం అధికారి పీఎస్ఐ ఎస్ఎస్ వడ్డెర మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు ఉపయోగించడం, విక్రయించడం రెండూ అపరాధమన్నారు. దుష్టులు, సంపన్నులు పేద వారిని మానసిక బలహీనులను వాడుకుని తమ కార్యక్రమాలను కొనసాగించడానికి వీటిని ఉపయోగిస్తారన్నారు. అందువలన అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే 100కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు. అలాగే ఏఎస్ఐ ప్రకాష్ మాట్లాడుతూ పిల్లలు తల్లిదండ్రులకు పేరు తెచ్చే విధంగా నడుచుకోవాలని, చెడు అలవాట్లకు లోనుకాకూడదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది నూర్ అహ్మద్, సుధాకర్, సమాలోచన అధికారి ప్రశాంత్ కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ వీరేష్, అలాగే తాలుకా ఆరోగ్య శిక్షణ అధికారి శివప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కంద యోగ శిక్షణ ప్రారంభం



యోగ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తుకారామ్

తోరణగల్లు, జనవరి 9 : సండూరు పట్టణంలోని గురు భవనంలో స్కందగిరి యోగా కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే తుకారామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనానికి యోగ శిక్షణ ఎంతో అవసరమని యోగాభ్యాసంతో అందరూ ఉత్తమ ఆరోగ్యాన్ని పొందాలని కోరారు. యశ్వంత్ నగర్ గురుసిద్ధరామేశ్వర విరక్తిమఠస్వామి, గంగాధర స్వామి, తహసీల్దార్ అనిల్ కుమార్, తాలుకా పంచాయతీ సెక్రటరీ షడక్షరయ్య, తాలుకా శిక్షణాధికారి బీఆర్ అక్కి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించకండి

తరతరాలుగా అటవీ భూములను సాగు చేస్తున్న రైతులను ఇబ్బంది పెట్టరాదని అటవీ అధికారులకు ఎమ్మెల్యే తుకారామ్ సూచించారు. సండూరు తాలుకా భుజంగనగర్‌లో ఎస్సీ, ఎస్టీ ప్రజలు తరతరాలుగా అటవీ భూములను సాగు చేస్తుండగా, అధికారులు ఇబ్బందిపెడుతున్నారన్నారు. రైతులకు ఇబ్బందులు కలిగించరాదని ట్రిబ్యునల్ సూచించిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సమావేశంలో పలువురు అటవీఅధికారులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ దడేసూగూరు ఆలంబాషా తాత ఉరుసు



ఆలంబాషా దర్గాను దర్శించుకుంటున్న భక్తులు

సిరుగుప్ప, జనవరి 9 : శ్రీ దడేసూగూరు ఆలంబాషా తాత ఉరుసు ఉత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. సిరుగుప్ప, సింధనూరు తాలుకాల మధ్య తుంగభద్ర నది గట్టున ఉన్న ఆలంబాషా తాత ఉరుసు మూడు రోజుల పాటు వైభవంగా జరగడం ఆనవాయితీ. సోమవారం గంధం, మంగళవారం ఉరుసు, బుధవారం జియారత్ కార్యక్రమాలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా రాయచూరు, బళ్లారి, కొప్పాళ, హైదరాబాద్, వివిధ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. ఆలంబాషా తాత దర్గాను దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. కాయ కర్పూరంతో స్వామివారికి మొక్కులు సమర్పించారు. ఈ యేడాది దర్గాకు భారీగా జనం తరలిరావడంతో రద్దీ ఎక్కువైంది.

బళ్లారి ఆగ్రో ప్రాసెసింగ్ క్లస్టర్ నిర్మాణానికి ప్రతిపాదనలు

బళ్లారి సిటీ, జనవరి 9: జిల్లాలో బళ్లారి ఆగ్రో ప్రాసెసింగ్ క్లస్టర్(బీఏపీసీ) నిర్మాణానికి కేఎం ఈఆర్‌సీ గ్రాంట్ నుంచి అదనంగా రూ. 20 కోట్లతో రాష్ట్ర గనులు-పర్యావరణ పునరావాస సంస్థకు ప్రతిపాదనలు అందజేశామని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా తెలిపారు. రాష్ట్ర సాంబారు పదార్థాల డెవలప్‌మెంట్ బోర్డు హుబ్లీ, ఇండియన్ సాంబారు పదార్థాల బోర్డు కొచ్చిన్ , హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని హోటల్ రాయల్ పోర్టులో ఏర్పాటు చేసిన సుగంధ ద్రవ్యాల కొనుగోలు, విక్రయదారుల సదస్సు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బళ్లారి జిల్లా మిర్చి పంటకు ప్రసిద్ధి అని, మన ప్రాంత రైతులకు స్థానికంగా మార్కెట్ కల్పించడంతో పాటు జిల్లా చిరకాల డిమాండ్ అయిన బళ్లారి ఆగ్రో ప్రాసెసింగ్ క్లస్టర్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో ఉద్యాన పంటలకు ప్రచారం , మార్కెటింగ్ వ్యవస్థ, కొనుగోలుదారులు, అమ్మకదారుల సహకారం అవసరమన్నారు. కేరళలోని కొచ్చిన్ ఇండియన్ ఫుడ్స్ బోర్డు డైరెక్టర్ ధర్మేందర్ దాస్ మాట్లాడుతూ, మసాలా దినుసుల ఉత్పత్తి, ఎగుమతిలో కర్ణాటక రాష్ట్రం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. దేశంలోనే మిర్చి ఉత్పత్తిలో కర్ణాటక రాష్ట్రం 4వస్థానంలో ఉందన్నారు. భారత దేశం వివిధ సుగంధ ద్రవ్యాల మాతృభూమిగా పిలువబడుతుందన్నారు. ఈ సందర్భంగా మునీరాబాద్ ఉద్యాన కళాశాల వృక్షశాస్త్ర ప్రొఫెసర్ రాఘవేంద్ర ఆచారి, మునీరాబాద్ యాదవ్, హొన్నూరప్ప, గిరీశ్ , సిద్ధరామయ్య, ఉద్యానవన శాఖాధికారులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

నేడు ప్రధాన ఆసుపత్రికి భూమిపూజ

వర్చువల్‌గా పాల్గొననున్న సీఎం



సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న మేయర్ సత్య

హోసూరు జనవరి 9: హోసూరులో రూ.100 కోట్లతో నిర్మిస్తున్న జిల్లా ప్రధాన ఆసుపత్రికి తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం భూమి పూజ చేయనున్నారు. హోసూరు కార్పొరేషన్ మేయర్ సత్య, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, కమిషనర్ స్నేహాల నేతృత్వంలో మంగళవారం జరిగిన నెలవారీ సమావేశంలో ఈ విషయాలను వెల్లడించారు. హోసూరు రాయకోట రోడ్డులోని కారపల్లి సమీపాన ప్రధాన ఆసుపత్రికి ముఖ్యమంత్రి స్టాలిన్ బుధవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారన్నారు. దీనికి తోడుగా హోసూరు కార్పొరేషన్‌లోని జూజూ వాడి, మూకొండపల్లి, జేజే నగర్‌తో పాటు మరికొన్ని ప్రాంతాల్లో రూ.7.5 కోట్లతో ఆరోగ్య కేంద్రాలను నిర్మిస్తున్న ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో తాగునీరు, రోడ్ల అభివృద్ధికి రూ.50 కోట్లు గ్రాంటు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరినట్టు తెలిపారు. కాగా స్థానిక కౌన్సిలర్ శ్రీనివాసులు మాట్లాడుతూ, హోసూరు కార్పొరేషన్ అధికారులు ఇతర కౌన్సిలర్లను గౌరవించడం లేదని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం లేదన్నారు. 100 మీటర్ల మేర పైపులను అమర్చి తాగునీటి సమస్యను పరిష్కరించాలని సూచించినా పనులు జరగలేదన్నారు. స్థానిక సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదన్నారు. సమావేశంలో పబ్లిక్ హెల్త్ కమిటీ చైర్మెన్ మాదేశ్వరన్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలను నియంత్రించండి

హోసూరు జనవరి 9: పారిశ్రామిక నగరం హోసూరులో గత కొద్ది రోజులుగా హత్యకేసులు అధికవుతున్నాయని వెంటనే వీటికి అడ్డుకట్ట వేయాలని నేరాల నియంత్రణకు అదనపు పోలీసులను నియమించాలని తమిళనాడు ప్రభుత్వాన్ని సామాజిక కార్యకర్తలు, స్థానిక ప్రజలు కోరుతున్నారు. తమిళనాడు - కర్ణాటక సరిహద్దులో ఉన్న హోసూరు ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందింది. ముఖ్యంగా అశోక్ లైలాండ్, టీవీఎస్, టైటాన్, టాటా వంటి పెద్ద కంపెనీలే కాకుండా 3వేల కంటే ఎక్కువగా చిన్న తరహా ఫ్యాక్టరీలు కూడా పనిచేస్తున్నాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఇక్కడ పనిచేస్తున్నారు. కొంతకాలంగా హోసూరులో వరుస హత్యలు, దోపిడీ ఘటనలు అధికమవుతుండడంపై ప్రజల్లో ఆందోళన నెలకొంది. డిసెంబరు 19న జంటహత్యలు చోటు చేసుకోగా 15మందిని అరెస్టు చేశారు. అదేవిధంగా హోసూరు సమీపంలోని ఎలువపల్లి గ్రామానికి చెందిన మునిరాజ్ (40) అనే పాలవ్యాపారిని కూడా అదే విధంగా హత్య చేశారు. గడిచిన పదిహేను రోజుల్లో నాలుగు హత్యలు చోటుచేసుకోవడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

ఆహార భద్రతా విభాగం అధికారుల తనిఖీలు



పాడైన చికెన్‌పై ఫినాయిల్ పోసి నాశనం చేస్తున్న అధికారులు

హోసూరు(క్రైం), జనవరి 9: హోసూరు పరిసర ప్రాంతాల్లో ఆహారభద్రతా విభాగం మంగళవారం తనిఖీలు చేపట్టింది. కృష్ణగిరి జిల్లా కలెక్టర్ సరయు, డిజిగ్నేటెడ్ ఆఫీసర్ వెంకటేశన్ సూచనలతో బాగలూరు ప్రాంతంలోని కొన్ని రెస్టారెంట్‌లను హోసూరు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ముత్తుమారియప్పన్ తనిఖీ చేశారు. సుమారు 60 కిల్లోల పాడైన చికెన్, మటన్, పిష్, ఫుడ్‌లను నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్టు గుర్తించారు. అలాగే కొన్ని బేకరీ స్వీట్ షాపుల్లో అమ్మకానికి ఉంచిన సుమారు 9 కిలోల స్వీట్ గడువు ముగిసిందని గుర్తించి ఆ ఉత్పత్తులను ఫినాయిల్ పోసి ధ్వంసం చేశారు. రెస్టారెంట్, బేకరీ యజమానులకు హెచ్చరిక నోటీసులు జారీ చేయడమే కాక జరిమానా కూడా విధించారు. ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్న హోటళ్లు, బేకరీలు, రిసార్టులు, లగ్జరీ హోటళ్ల యజమానులపై ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్ట్స్ యాక్ట్ 2006 ప్రకారం చర్యలు తీసుకున్నారు.

పోలీసులపై దొంగల ముఠా దాడి

రాయచూరు జనవరి 9 : జిల్లాలోని మస్కి తాలూకా సుంకనూరు గ్రామంలో జరిగిన ఒక దొంగతనం విచారణ కోసం వెళ్లిన మంజునాథ, గోపాల్ అనఇద్దరు కానిస్టేబుళ్లపై దొంగల ముఠా దాడికి తెగబడింది. కేసు విచారణ కోసం సోమవారం రాత్రి వేళ గుడుదూరుకు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లు అనుమానాస్పదంగా బైక్ పై వెళుతున్న ఇద్దరు దుండగులను ఆపే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులను చిక్కకుండా బైక్ పై పరారు కావడంతో వారిని వెంబడించిన పోలీసులు వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. ఈలోగా మరికొంత మంది దుండగులు వారితో కలిసి ఇద్దరు పోలీసులపై ఇనుప చువ్వలతో దాడికి దిగారు. దీంతో ఇద్దరు పోలీసులు తీవ్రంగా గాయపడగా ప్రాణభయంతో దుండగుల నుంచి తప్పించుకుని ఆస్పత్రికి చేరారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ దాదావలి ఆస్పత్రికి వెళ్లి కానిస్టేబుళ్లను ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం సింధనూరు ఆస్పత్రికి తరలించారు. కాగా దాడికి పాల్పడిన దుండగులు పరారయ్యారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న బళగానూరు పోలీసులు దొంగల ఆచూకీ కోసం వేట ప్రారంభించారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుళ్లు మంజునాథ, గోపాల్

కానిస్టేబుళ్లను పరామర్శించిన ఎస్పీ

దొంగల దాడిలో గాయపడి సింధనూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మంజునాథ, గోపాల్‌ల అనే ఇద్దరు కానిస్టేబుళ్లను జిల్లా ఎస్పీ బి.నిఖిల్ మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో మాట్లాడిన ఆయన గాయపడిన పోలీసులకు మెరుగైన చికిత్స అందుతున్నట్లు తెలిపారు. అదే సమయంలో దొంగలను నిర్బంధించేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన ప్రకటించారు. ఆయన వెంట డీఎస్పీ తదితరులున్నారు.

ఫసల్ భీమా ద్వారా రైతులకు తగిన పరిహారం

- అదనపు జిల్లా అధికారి డాక్టర్ కేఆర్ దుర్గేష్



మాట్లాడుతున్న డాక్టర్ కేఆర్ దుర్గేష్

రాయచూరు జనవరి 9 : ఈ ఏడాది రబీ సీజన్‌లో పంటల భీమా కోసం ఫసల్ భీమా పథకం ద్వార పేరు నమోదు చేసుకున్న వారికి నిబంధనల మేరకు పరిహారం అందజేస్తామని అదనపు జిల్లాధికారి డాక్టర్ కేఆర్ దుర్గేష్ తెలిపారు. ఫసల్ భీమా రైతుల సమస్యల పై చర్చించేందుకు మంగళవారం నగరంలోని డీసీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడిన ఏడీసీ, కమిటీలో తీసుకున్న తీర్మానాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. కాగా జిల్లాలో మొత్తం 26174 మంది రైతులు ఫసల్ భీమా పథకం ద్వార తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంబ్...

పింగళి లక్ష్మీకాంతం (జయంతి - వర్ధంతి)



ప్రసిద్ధ తెలుగు కవి పింగళి లక్ష్మీకాంతం 1894 జనవరి 10న కృష్ణా జిల్లా అర్తమూరు గ్రామంలో జన్మించారు. కాటూరి వెంకటేశ్వరరావుతో కలసి అంజనేయస్వామిపై శతకం చెప్పారు. పింగళి కాటూరి జంట కవులుగా పలుచోట్ల శతావధానాలు చేశారు. కాగా పాండవోద్యోగ విజయములు, ముద్రా రాక్షసము నాటకాలలో ధర్మరాజు, రాక్షస మంత్రిగా పాత్రలలో రాణించి ప్రశంస టలు పొందారు. ఆంధ్ర విశ్వకళా పరిషత్, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలోనూ ఆంధ్రా చార్యులుగా, అధ్యక్షులుగా వ్యవహరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ కార్యవర్గ సభ్యులుగా వ్యవహరిం చారు. 1972 జనవరి 10న పరమపదించారు. ఇలా జయంతి, వర్ధంతిలు ఒకే తేదీన రావడం కాకతాళీయం.

కేజే ఏసుదాసు (పుట్టినరోజు)



గాన గంధర్వుడిగా పేరొందిన కట్టస్సేరి జోసెఫ్ ఏసుదాసు 1940 జనవరి 10న కేరళ రాష్ట్రం కొచ్చిన్‌లో జన్మించారు. భారతీయ శాస్త్రీయ సంగీత కళాకారుడు, సినీ నేపథ్య గాయకుడు. ఐదు దశాబ్దాల కళా జీవితంలో తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, బెంగాలీ, ఒరియా భాషలతోపాటు అరబిక్, ఆంగ్లం, లాటిన్, రష్యన్ భాషలలో సుమారు 80 వేల పాటలు పాడారు. 14 భాషల్లో సినిమాలు, ప్రైవేట్ ఆల్బమ్‌లు, భక్తి పాటలు కలిపి లక్షకుపైగా పాటలు పాడారు. శబరిమలై అయ్యప్పస్వామి ఆలయంలో పవళింపు వేళ పాడే 'హరివరాసనం' పాట ఎంతో పేరొందింది. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్, సంగీత నాటక అకాడమీ అవార్డు, ఏడుసార్లు జాతీయ ఉత్తమ గాయకుడి పురస్కారం, ఇతర రాష్ట్రాలచే 43సార్లు ఉత్తమ గాయకుడి పురస్కారాలు, ఇతర గౌరవాలు, సత్కా రాలు పొందారు.

అల్లు అరవింద్ (పుట్టినరోజు)



అల్లు అరవింద్ 1949 జనవరి 10న పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో జన్మించారు. 'పద్మశ్రీ' గ్రహీత దివంగత అల్లు రామలింగయ్య కుమారుడు. దాదాపు ఐదు దశాబ్దాలుగా గీతా ఆర్ట్స్ బ్యానరుపై తెలుగు సినిమాలు నిర్మిస్తున్నారు. కొన్ని సినిమాలలో కూడా నటించారు. 2020లో డిజిటల్ ఓటీటీలోకి అడుగుపెట్టి 'ఆహా' పేరుతో తెలుగుకు ఒక గుర్తింపు తెచ్చారు. ఇండియన్ సూపర్‌లీగ్ క్లబ్ కేరళ బ్లాస్టర్స్ ఎఫ్‌సీకి కో-ఓనర్‌గా ఉన్నారు. సంతోషం దాసరి స్మారక అవార్డు పొందారు. కాగా ఆయన కుమారుడు అల్లు అర్జున్ టాలీవుడ్‌లో ప్రముఖ హీరోగా కొనసాగుతున్నారు.

రాకేశ్ చౌరాసియా (పుట్టినరోజు)



రాకేశ్ చౌరాసియా 1971 జనవరి 10న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అలహాబాద్‌లో జన్మించారు. వేణు గాన విద్వాంసుడు. హిందూస్తానీ సంగీతంలో రాణించారు. హరి ప్రసాద్ చౌరాసియాకు మేనల్లుడు. ఇండియన్ మ్యూజిక్ అకాడమీ అవార్డు, ఆదిత్య బిర్లా కళాకిరణ్ పురస్కార్, గురు శిష్య అవార్డు, పండిత్ జస్‌రాజ్ సంగీత రత్న అవార్డు తదితర పురస్కారాలు అందుకున్నారు.

హృతిక్ రోషన్ (పుట్టినరోజు)



హృతిక్ రోషన్ 1974 జనవరి 10న ముంబైలో జన్మించారు. తండ్రి రాకేశ్ రోషన్ సినీ నిర్మాత, దర్శకుడు. 1980 దశకంలో బాలనటుడిగా నటించిన హృతిక్, తండ్రి రాకేశ్ దర్శకత్వం వహించిన కహోనా ప్యార్ హై (2000) సినిమాతో తెరంగేట్రం చేశారు. ఇప్పటివరకు 6 ఫిలిం ఫేర్ పురస్కారాలు అందుకున్నారు. బాలీవుడ్‌లో టాప్ హీరోగా అత్యధిక పారితోషికం అందుకుంటున్నారు.

కాలువలను బాగు చేయండి



మాచినేనిహళ్లి కాలువలో పేరుకున్న చెత్తా చెదారం

చేళూరు, జనవరి 9: తాలూకాలోని పాలచెరువు గ్రామ పంచాయతీ పరిధిలోగల పలు గ్రామాలలో మురుగునీటి కాలువలు చెత్తాచెదారంతో నిండాయి. కాలువల నుంచి వెలువడే దుర్గంధంతో ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు వాపోతున్నారు. కాలువలలో పేరుకున్న చెత్తాచెదారం తొలగించి మురుగునీరు సజావుగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. తాలూకాలో ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చేందుకు అధికారులు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

హొద్రిపురలో మేకలు చోరీ

దొడ్డబళ్లాపుర, జనవరి 9: తాలూకాలోని దొడ్డ బెళవంగల హోబళి హొద్రిపుర గ్రామంలో అర్ధరాత్రివేళ పశువులపాకలోని మూడు మేకలను దుండగులు చోరీ చేశారు. కృష్ణప్పకు చెందిన సుమారు 60వేల రూపాయల విలువైన మేకలు చోరీకి గురైనట్టు తెలుస్తోంది. పాకలో పశువులతోపాటు మేకలను కట్టేశారు. మంగళవారం తెల్లవారుజామున పశువులను బయటకు తేవాలని చూడగా బీగాలు పగులగొట్టబడి ఉండడాన్ని గుర్తించారు. రెండు మేకలు, ఒక మేకపోతు చోరీకి గురయ్యాయని రైతు వాపోయాడు. ఈ మేరకు దొడ్డబెళవంగల పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తాలూకాలో పలు గ్రామాలలో పశువులు తరచూ చోరీకి గుర వుతుండడంపై రైతులలో ఆందోళన నెలకొంది. మరోవైపు చిరుత దాడులు, మరోవైపు దొంగల బెడదతో సతమత మవుతున్నారు. నిందితులను అరెస్టు చేసి కఠినశిక్ష విధించాలని రైతులు కోరుతున్నారు.

బెంగళూరులో 22 సార్లు 'గ్రీన్ కారిడార్'

▸ గత ఏడాది వందలాది మందికి ప్రాణం పోసిన పోలీసులు

బెంగళూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర పోలీసులు కేవలం లాఠీలు ఝుళిపించడమే కాదు. తమకూ మానవత్వం ఉందని నిరూపించుకుంటున్నారు. 2023లో బెంగళూరు నగరంలో రోగులకు అత్యవసరంగా అమర్చేందుకు గుండె, కాలేయం, తదితర అవయవాలు అతివేగంగా సంబంధిత ఆసుపత్రులకు చేరుకునేందుకు గాను ఏకంగా 22 సార్లు గ్రీన్ కారి డార్‌లను ఏర్పాటు చేశారు. దాతల నుంచి సేకరించిన అవయవాలు ఇలా సకాలంలో అందడంతో వందలాది మంది ప్రాణాలు కాపాడుకోగలిగారు. ఈ మేరకు బెంగళూరు ట్రాఫిక్ పోలీసులు బెంగళూరులో ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రీన్ కారిడార్ల ఏర్పాటే కాకుండా అత్యవసరంగా రోగులు ఆసుపత్రులకు చేరేందుకు గాను 500కు పైగా అంబులెన్స్‌లకు వేగిరంగా క్లియరెన్స్ ఇచ్చారు. బెంగళూరులో రోగుల ప్రాణాలను కాపాడేందుకు అవయవదానం పొందిన తర్వాత వాటిని నగరంలోని పలు ఆసుపత్రులకు సత్వరం పంపేందుకు 11 కిలోమీటర్ల నుంచి 40 కిలోమీటర్ల వరకు గ్రీన్ కారిడార్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అంటే యుద్ధప్రాతిపదికన ఈ అవయవాలతో కూడిన అంబులెన్స్‌లు ప్రయాణం చేసే మార్గంలో జీరో ట్రాఫిక్ సదుపాయం కల్పిస్తారన్న మాట. గత ఏడాది గత ఏడాది జనవరి 12న హెబ్బాళలోని ఏస్టర్ సీఎం ఆసుపత్రి నుంచి పాత ఎయిర్‌పోర్టు రోడ్డులోని మణిపాల్ ఆసుపత్రికి ఒక అవయవాన్ని 11 కిలోమీటర్ల దూరం ఉన్నా గ్రీన్ కారిడార్ సాయంతో కేవలం 19 నిముషాల్లోనే పంపించగలిగారు. అలాగే మే 26న కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి పాత ఎయిర్‌పోర్టురోడ్డులోని మణిపాల్ ఆసుపత్రికి 40 కిలోమీటర్ల దూరం ఉన్నా కేవలం 35 నిముషాల్లోనూ గుండెను పంపించారు. నిజానికి ఇతర జిల్లాల నుంచి హెలికాప్టర్ ద్వారా తరలిస్తున్న అవయవాలతో పోల్చితే గ్రీన్ కారిడార్‌లో తరలిస్తున్న అవయవాలు మరింత వేగంగా చేరుకుంటున్నాయని గోల్డెన్ అవర్‌లో వీటితో సంబంధిత రోగులకు విజయవంతంగా శస్త్రచికిత్సలు జరుగుతున్నాయని ట్రాఫిక్ విభాగం పోలీసులు వెల్లడించారు.

కొత్తనూరులో వికసిత భారత సంకల్పయాత్ర



వికసిత భారత సంకల్పయాత్రలో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

శిడ్లఘట్ట, జనవరి 9: తాలూకాలోని కొత్తనూరు గ్రామంలో వికసిత భారత సంకల్ప యాత్రను చేపట్టారు. గ్రామపంచాయతీ, ప్రగతి గ్రామీణబ్యాంకు, కెనరా బ్యాంకు సహకారంతో కార్యక్రమం చేపట్టారు. దేశ ప్రగతి కార్యక్రమాల్లో తామంతా పాల్గొంటామని ప్రతిజ్ఞ చేయించారు. బీజేపీ ప్రముఖుడు ఆనంద గౌడ మాట్లాడుతూ జనౌషధి కేంద్రం ద్వారా తక్కువధరకే మందులు లభిస్తున్నాయని, పేదలకు సైతం సులభంగా రుణాలు అందుతున్నాయన్నారు. కొవిడ్ వంటి క్లిష్ట సమయంలో వైరస్ నియంత్రణకు దేశవ్యాప్తంగా ఉచిత వ్యాక్సిన్ సమకూర్చిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకే దక్కుతుందన్నారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డ్ ద్వారా ఉచిత వైద్యం సమకూరుతోందన్నారు. స్వనిధి, ముద్ర పథకాల ద్వారా నేరుగా రుణ సౌలభ్యం సాధ్యమవుతోందన్నారు. తద్వారా ఆర్థిక ప్రగతి వీలవుతోందన్నారు. ఎన్నో రకాల పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఖాతాలకు నగదు బదిలీ అవుతోందని, తద్వారా పథకాలలో అక్రమాలకు అడ్డుకట్ట వేశారన్నారు. నామమాత్రపు మొత్తంతో జీవితబీమా, ఇతర రుణ సౌలభ్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పద్మశ్రీ పురస్కార గ్రహీత పిండిపాపనహళ్ళి మునివెంకటప్పను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ అధ్యక్షురాలు పార్వతమ్మ, ఉపాధ్యక్షుడు నరేంద్ర, పీడీఓ పవిత్రా, సభ్యులు పిళ్ళమ్మ, మునిరత్నమ్మ, వెంకటరమణ, కెనరా బ్యాంకు మేనేజర్ శేఖర్, గ్రామీణబ్యాంకు మేనేజర్ రమేశ్, తాలూకా ఆరోగ్యాధికారి దేవరాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి పలువురి చేరిక



ఎమ్మెల్యే సమక్షంలో చేరిన ప్రముఖులు

బంగారపేట, జనవరి 9: బూదికోటె పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం డైరెక్టర్‌గా గెలుపొందిన చంద్రశేఖర్, మునివెంకటస్వామిలు బీజేపీని వీడి ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి సమక్షంలో కాంగ్రెస్‌లోకి చేరారు. ఎస్ఎన్ సిటీలో మంగళవారం కార్యక్రమం జరిగింది. కాంగ్రెస్‌లో చేరిన అనంతరం చంద్ర శేఖర్ మాట్లాడుతూ బీజేపీలో తాను సుదీర్ఘకాలం కార్యకర్తగా పని చేశానని ఐదేళ్లక్రితం జరిగిన డైరీ ఎన్నికల్లో అధ్యక్షస్థానానికి తాను, మార్కండయ్యగౌడ పోటీ పడ్డామని, కొందరు ప్రముఖుల సమక్షంలో అధ్యక్ష పదవిని పంచుకున్నామని అయితే ఆయన అవధి ముగిసినా తనకు అధ్యక్ష పదవి ఇవ్వలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒక తాలూకాస్థాయి నాయకుడిగా ఇచ్చిన మాటను తప్పడమే కాక పలు రకాలుగా వేధిస్తున్నారన్నారు. ఈ ఎన్నికల్లో కూడా నీవే అధ్యక్షుడివని నమ్మించి మోసం చేశారన్నారు. అందుకే బీజేపీని వీడానన్నారు. మళ్లీ డైరెక్టర్ ఎన్నికల్లో తనను ఓడించేందుకు ప్రయత్నించారని అయితే అవి సఫలం కాలేదన్నారు. ప్రస్తుతం అధికారం కోసం కాంగ్రెస్‌లో చేరలేదని, ఎమ్మెల్యే నారాయణస్వామి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి చేరానన్నారు. ఈ సందర్భంగా బూదికోటె గ్రామపంచాయతీ అధ్యక్షుడు బీఆర్ మంజునాథ్, తాలూకా పంచాయతీ మాజీ అధ్యక్షుడు మహదేవప్ప, బూదికోటె సమాజ సేవకుడు బాబు, వీఎస్ఎస్ఎన్ మాజీ అధ్యక్షుడు విజికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే సుబ్బారెడ్డి

బాగేపల్లి, జనవరి 9: నియోజకవర్గంలో ఇంటిస్థలం లేని పేదలకు స్థలాలు కేటాయించే అంశంపై వెంటనే పరిశీలించి తగిన ప్రదేశాన్ని సూచించి చదును చేయించి పంపిణీకి సిద్ధం చేయాలని గ్రామపంచాయతీ అధికారులకు ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి ఆదేశించారు. తాలూకాలోని పరగోడు గ్రామపంచాయతీ వడ్రపాళ్యలో పేదలకు ఇంటిస్థలాన్ని కేటాయించే అంశంపై వడ్రపాళ్య గ్రామం పక్కన రహదారి 44కు అనుబంధమైన సర్వే 162లో సుమారు 2 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. ఇప్పటికే గ్రామంలో సుమారు 71మందికి స్థలం కేటాయించేందుకు గ్రామసభలో తీర్మానించారు. ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి మంగళవారం స్వయంగా స్థలాన్ని పరిశీలించారు. స్థలం పంపిణీ చేయడానికి ముందు సదరు ప్రదేశంలో ఉన్న పెద్ద పెద్ద గుంతలను పూడ్చివేయాలని గ్రామ పంచాయతీ పీడీఓ నాగమణికి సూచించారు. సదరు స్థలానికి ఆమోదం లభించిందని, పహణిలోనూ నమోదైందన్నారు. రహదారికి అనుబంధంగా ఉన్న ఈ భూమి విలువ కోట్లాదిరూపాయలు పలుకుతోందన్నారు. ఒక్కో ఇంటి స్థలం రూ.10-15లక్షల విలువ ఉంటుందన్నారు. ఇప్పటికే ఒక ఎకరా స్థలాన్ని చదును చేయించామని, మిగిలిన ఎకరా ప్రదేశాన్ని నరేగా పథకంకింద చదును చేయించదలిచామన్నారు. ఈ సందర్భంగా చిక్కబళ్ళాపుర జిల్లా సహకార సమాఖ్య అధ్యక్షుడు హెచ్‌వీ నాగరాజు, పరగోడు గ్రామపంచాయతీ అధ్యక్షురాలు నాగమణి సదాశివరెడ్డి, ఉపాధ్యక్షురాలు అరుణ నాగరాజు, వడ్రపాళ్య ప్రముఖులు ఆంజినప్ప, సుధాకర, కార్యదర్శి పార్థసారధి, సూరి తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజు ఈడీ అధికారుల దాడులు



అశ్వత్థనారాయణ బాబు నివాసం వద్ద ఈడీ అధికారుల కారు

చింతామణి, జనవరి 9: కోలారు - చిక్కబళ్ళాపుర పాలసమాఖ్య (కోచిముల్) అధ్యక్షుడు మాలూరు ఎమ్మెల్యే నంజేగౌడ, చింతామణికి చెందిన డైరెక్టర్ అశ్వత్థ నారాయణ బాబు ఇంటిపై సోమవారం ఈడీ అధికారుల దాడులు నిర్వహించగా మంగళవారం కూడా కొనసాగాయి. కోచిముల్‌లో 82 పోస్టుల నియామకాలలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు, చిక్కబళ్ళాపురలో రూ.200 కోట్లతో మెగా డెయిరీ, కోలారు తాలూకా బెళగానహళ్ళి వద్ద రూ.200కోట్లతో గోల్డెన్‌డైరీ, చింతామణిలో రూ.4.30కోట్లతో ఐస్‌క్రీమ్ ఫ్యాక్టరీ టెండర్‌కు సంబంధించి అక్రమాల ఆరోపణల నేపథ్యంలో దాడులు నిర్వహించారు. సోమవారం ఉదయం కోచిముల్ డైరెక్టర్‌గా ఉన్న మాలూరు ఎమ్మెల్యే నంజేగౌడ ఇల్లు, కోలారు తాలూకాలోని కోచిముల్ కార్యాలయాలపై దాడులు నిర్వహించి రికార్డులను ఒకబృందం పరిశీలించింది. మరో బృందం చింతామణి పట్టణం ప్రభాకర్ లే అవుట్‌లోని కోచిముల్ డైరెక్టర్ ఊలవాడి అశ్వథ్‌నారాయణ్ బాబు ఇంటిపై సీఆర్‌పీఎఫ్ పోలీసులతో కలసి ఈడీ అధికారులు తనిఖీలు చేశారు. మంగళవారం కూడా సోదాలు చేశారు. మరింత విచారణకు కోచిముల్ కార్యాలయానికి రావాలని సూచించినట్టు తెలుస్తోంది.

సమయానికి రాని ఆర్టీసీ బస్సులు..

విద్యార్థుల నిరసన



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

బంగారపేట, జనవరి 9: పాఠశాల, కళాశాలలకు వెళ్లేందుకు తగిన సమయంలో బస్సు సర్వీసులు లేకపోవడంపై పట్టణంలోని బస్టాండ్ వద్ద విద్యార్థులు మంగళవారం నిరసన తెలిపారు. కళాశాల సమయానికి బస్సులు లేకపోవడంతో తరగతులకు హాజరయ్యేందుకు సమస్య తలెత్తుతోందన్నారు. ఇప్పటికే రవాణాశాఖ అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకపోయిందని ఆక్రోశం వ్యక్తం చేశారు. వివిధ గ్రామాలనుంచి పట్టణానికి వచ్చిన విద్యార్థులు కోలారు, కేజీఎఫ్‌లలోని కళాశాలలకు వెళ్తుంటారు. అయితే బంగారపేట డిపో నుంచి కళాశాలలకు వీలుగా సర్వీసులు లేకపోవడంపై విద్యార్థులు ఆక్రోశం వ్యక్తం చేశారు. కేఎస్ఆర్టీసీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కొందరు విద్యార్థులు మాట్లాడుతూ ప్రభుత్వం ఉచిత బస్‌పాసు ఇచ్చినా ప్రయోజనం లేకపోయిందని, సకాలంలో బస్సులు లేవన్నారు. బుధవారం కూడా నిరసన కొనసాగిస్తామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అభిషేక్, కిరణ్, లోకేశ్‌కుమార్, ప్రభుదేవ్, తేజస్, సంజయ్, కార్తిక్, జశ్వంత్, కిశోర్, శబరీశ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిధామలో విశేష కార్యక్రమాలు



మేడారామకృష్ణ దంపతులకు జ్ఞాపికతో సన్మానం

బొమ్మనహళ్ళి, జనవరి 9: అరికెరె శాంతినికేతన్ లే అవుట్‌లో వెలసిన శాంతిధామలో సహస్ర చంద్రదర్శన పేరిట ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయ ట్రస్టు అధ్యక్షుడు మేడా రామకృష్ణ నేతృత్వంలో గణపతి హోమం, శాంతి హోమం, నవగ్రహ హోమం, మృత్యుంజయ హోమం ఇతర ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. రెండు రోజులపాటు మంజునాథస్వామికి అభిషేకం, షిర్డీసాయిబాబాకు, సంతోషిమాతా ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయంలోని గోశాలకు మేడా రామకృష్ణ కుటుంబీకులు గోదానం చేశారు. మంజునాథస్వామికి పంచామృతాభిషేకం, సాయిబాబా పాదుకలకు నమస్కారం, సాయి సంతోషిమాతా ఆలయంలో పూజలు, నవగ్రహాలకు పూజలు నిర్వహించారు. బ్రహ్మర్షి నూరి నారాయణమూర్తి ఆశీర్వచనం, ప్రవచనం జరిగింది. 80వ ఏట కూడా రామకృష్ణ భగవంతుడి సేవలో తరిస్తున్నారని ప్రశంసించారు. అనంతరం మేడా రామకృష్ణ, నాగరత్న దంపతులకు ట్రస్టు సభ్యులు ప్రత్యేక జ్ఞాపిక ప్రదానం చేసి సత్కరించారు. కాగా టీవీ నాగేశ్వరరావు, సుబ్బరాజు తదితరులు ప్రత్యేకంగా అభినందించారు. ఆలయ ట్రస్టుకు చెందిన తాతయ్యగుప్త, మనోహర్‌గుప్త, కృష్ణయ్యశెట్టి, టీవీజీ గుప్త, సత్య నారాయణశెట్టి, మేడా కుటుంబీకులు తదితరులు పాల్గొన్నారు.

కరూరు వద్ద వ్యాన్‌బోల్తా

▸ కర్ణాటక అయ్యప్ప భక్తులకు గాయాలు



ఘటనా స్థలంలో బోల్తాపడిన వ్యాన్ ఇదే...

చెన్నై, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కరూరు జిల్లా వేలాయుధపాళయం సమీపం లోని సేలం బైపాస్ రోడ్డులో మంగళవారం ఉదయం కర్ణాటక నుంచి శబరిమలైకి అయ్యప్ప భక్తులతో వెళుతున్న వ్యాన్ బోల్తాపడటంతో పదిమంది గాయపడ్డారు. రోడ్డు పక్కనే నిలిచి ఉన్న కోడిగుడ్ల మినీ లారీని ఈ వ్యాన్ ఢీకొంది. దీనితో వ్యాన్‌లో ప్రయాణించిన అయ్యప్ప భక్తులలో పదిమంది గాయపడటంతో పోలీసులు వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

15న విద్వాన్ చింతపల్లి వెంకటరామయ్య శతజయంతి



పురాతన ఆహ్వానపత్రికను మీడియాకు చూపుతున్న నిర్వాహకులు

బెంగళూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సంగీత విద్వాన్ చింతలపల్లి వెంకటరామయ్య శతజయంతి వేడుకలు ఈనెల 15న జరగనున్నాయి. వేడుకల నిర్వహణా కమిటీ సభ్యులు బెంగళూరు ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మీడియాకు తెలిపారు. చౌడయ్య స్మారక భవనంలో ఉదయం 10 గంటలనుంచి రాత్రి 9 వరకు పలు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ముఖ్యఅతిథులుగా కంచికామకోటి ఆస్థాన విద్వాంసుడు డాక్టర్ శ్రీకాంతం నాగేంద్రశాస్త్రి, ప్రఖ్యాత వీణా విద్వాంసురాలు విదూషి డాక్టర్ సుమా సుధీంద్ర, మాజీ ఉపముఖ్యమంత్రి డాక్టర్ సీఎన్ అశ్వత్థనారాయణ, కన్నడ సాంస్కృతికశాఖ జాయింట్ డైరెక్టర్ బలవంతరావ్ పాటిల్, కంచి కామకోటిపీఠం ఆస్థాన విద్వాంసుడు డాక్టర్ చింతలపల్లి కే రమేశ్, అఖిల కర్ణాటక బ్రాహ్మణ మహాసభ అధ్యక్షుడు అశోక్ హార్నహళ్ళి పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సంగీత కార్యక్రమాలు జరుగుతాయని డాక్టర్ శ్రీకాంతం నాగేంద్ర శాస్త్రి బృందంచే ప్రత్యేక సంగీత విభావరి, చింతలపల్లి వెంకటరామయ్య శిష్య బృందంచే కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

కేజీఎఫ్ తెలుగు కళాసమితి ఆధ్వర్యంలో

28న సంక్రాంతి వేడుకలు

బెంగళూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కెజిఎఫ్ పట్టణం బీఈఎల్ నగర్‌కు చెందిన తెలుగు కళా సమితి ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు ఈ నెల 28న జరుగనున్నాయి. ఈ మేరకు సమితి అధ్యక్షుడు బీ ఈశ్వరనాథ్, కార్యదర్శి వీ తిరుపతి నగరంలో మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక బిఇఎంఎల్ కల్యాణ మంటపంలో ఉదయం 8 గంటలకు రంగ వల్లులతో పోటీలు ప్రారంభం కానున్నాయి. అనంతరం తెలుగు సంప్రదాయాలను చాటిచెప్పే వస్త్రాలంకరణ పోటీలు, సభ్యులు వారి కుటుంబ సభ్యులచే పలు నృత్యకార్యక్రమాలు ఉంటాయి. నేటి తరం మర్చిపోతున్న ఉట్టి కొట్టడం, టగ్ ఆఫ్ వార్ వంటి గ్రామీణ క్రీడలను ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని పలమనేరుకు చెందిన జనవిజ్ఞాన వేదిక శాస్త్రీయ అవగాహన కోసం ప్రత్యేక మ్యాజిక్ షోను నిర్వహించనుంది. పలమనేరుకు చెందిన ఏఎస్ యుగంధర్ బాబు, కే గిరిధర్ మూర్తిలచే అభ్యుదయ గేయాలు ఉంటాయి. మధ్యాహ్న భోజన విరామం అనంతరం బింగోను నిర్వహించనున్నారు. బెమెల్ కేజీఎఫ్ కాంప్లెక్స్ ముఖ్య ప్రధాన నిర్వహకులు కే చంద్ర గోపాల రాజు ముఖ్యఅతిథిగా పాల్గొననుండగా పలమనేరుకు చెందిన తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసినాథం నాయుడు, కెజిఎఫ్ తెలుగు కళా సమితి మాజీ అధ్యక్షులు కె.రామచంద్రారెడ్డి, జి.రాజయ్య, ఎం.మల్లికార్జున రెడ్డి అతిథులుగా పాల్గొంటారని ప్రకటనలో పేర్కొన్నారు.

విజయవంతంగా ఉచిత నేత్ర చికిత్స శిబిరం



శిబిరానికి హాజరైన వృద్ధులు, మహిళలతో వైద్యబృందం

బెంగళూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు టీ దాసరహళ్ళి సమీపంలోని హెసరఘట్ట మెయిన్ రోడ్డులో గల మంజునాథ నేత్రాలయలో ఉచిత నేత్ర చికిత్సా శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. పుట్టపర్తికి చెందిన ప్రభాత్ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు సహకారంతో మొత్తం 65 మందికి ఉచితంగా కాటరాక్ట్ సర్జరీలను జరిపామని మంజునాథ నేత్రాలయ నగరంలో మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా ఉభయ సంస్థలకు చెందిన ప్రభాకర్ రెడ్డి, బషీర్ అహ్మద్, డా. ఎంసి. మంజునాథ్, డా.కెఎస్.తంగప్ప హాజరయ్యారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన వృద్ధులకు, మహిళలకు ఆధునిక సాంకేతిక విధానాలతో ఈ శస్త్ర చికిత్సలను పూర్తి ఉచితంగా చేశామని ప్రకటన లో పేర్కొన్నారు.

విదేశాల్లో వైద్యవిద్యకు చేయూత



జ్యోతిప్రజ్వలనలో ప్రముఖులు

బెంగళూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో వైద్యవిద్యను అభ్య సించాలని ఇష్టపడే ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించే దిశలో డాక్టర్స్ డ్రీమ్ సంస్థ కోటి రూపాయలతో వైద్య జ్యోతి విద్యార్థి పథకాన్ని ప్రకటించింది. నగరంలో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ ముబారక్ మీడియాతో మాట్లాడుతూ ఎంతోమంది ప్రతిభావంతులైన విద్యార్థులకు మనదేశంలో వైద్యసీట్లు లభించడం గగనంగా మారిందని ఇలాంటి వారు విదేశాలలో వైద్యకోర్సులు చేయాలని ఎంతో ఆసక్తితో ఉన్నారన్నారు. ప్రత్యేకించి ప్రతిభావంతులైన మధ్య తరగతి, నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఈ పథకం ద్వారా రూ.కోటి వరకు సాయం అందిస్తామన్నారు. గత 13 సంవత్సరాలుగా ఈ పథకాన్ని రకరకాల రూపాలలో అమలు చేస్తూ వచ్చామన్నారు. తాజాగా వైద్యవిద్యార్థులకు దీన్ని వర్తింపచేయాలని తీర్మానించామన్నారు. సంస్థ నిర్వాహకులు అంతకుముందు విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

రెజ్లింగ్ విజేతకు ఆత్మీయ సన్మానం



శ్రీధర్‌ను సత్కరిస్తున్న గ్రామస్థులు

దొమ్మసంద్ర, జనవరి 9: కర్ణాటక స్టేట్ ఆర్మ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌షిప్‌లో దొమ్మసంద్ర గ్రామానికి చెందిన శ్రీధర్ 79కిలోల విభాగంలో కుడిచేతి వాటం, ఎడమచేతి వాటంలోనూ తొలిస్థానం సాధించారు. ఈమేరకు గ్రామానికి పేరు తెచ్చిన బృందాన్ని గ్రామస్థులు, అభిమానులు మంగళవారం ఆత్మీయంగా సత్కరించారు. బెంగళూరు జ్ఞానభారతి ప్రాంతంలో జయంతి కన్వెన్షన్‌హాల్‌లో ఇటీవల జరిగిన పోటీల్లో శ్రీధర్ సత్తా చాటుకున్నారు. ప్రత్యేక చేతన ఆశాకిరణ ట్రోఫీని సైతం దక్కించుకున్నారు. 2021 నుంచి 2024 వరకు వివిధ రాష్ట్రాల్లో జరిగిన పోటీల్లో పాల్గొని 12 పతకాలను సాధించిన ఘనత శ్రీధర్‌కు ఉంది. కాగా కర్ణాటక స్టేట్ ఆర్మ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో ఆనేకల్‌కు చెందిన రేణుక ప్రత్యేక విభాగంలో 65 కిలోల కేటగిరీలో ప్రథమస్థానం సాధించడంతో చాంపియన్‌షిప్ కర్ణాటక ఉషా కిరణ్ ట్రోఫీని దక్కించుకున్నారు.

ఓటు హక్కుపై నాటక ప్రదర్శన

బాగేపల్లి, జనవరి 9: ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన హక్కు అని అర్హులైన వారు తప్పకుండా ఓటు వేయాలని సూచిస్తూ నాటక ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. పోలింగ్ రోజున ఇచ్చే సెలవును వృథా చేయకుండా తప్పకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఘంటంవారిపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు నాటకం ద్వారా జాగృతి కల్పించారు. ఈ సందర్భంగా ఈఎల్‌సీ నోడల్ అధికారి ఎన్ఎన్ సంధ్యా తదితరులు పాల్గొన్నారు.